క్లుప్తంగా

సానుకూల దృక్పథంతో ఆలోచించాలి



ఇంజినీర్స్‌ను సత్కరిస్తున్న క్లబ్‌సభ్యులు

బోట్‌క్లబ్: మనం ఏ పని చేసినా సానుకూల దృక్పథంతో ఆలోచించినప్పుడే మనం అనుకున్నది సాధించగలమని గీతాపరివార్ సాంకేతిక శిక్షకురాలు పి.భాస్కర అనంతలక్ష్మి అన్నారు. స్థానిక కాస్మోపాలిటన్ క్లబ్‌లో ఆదివారం లయన్స్‌క్లబ్ కాకినాడ విజన్ సమావేశానికి ఆమె ముఖ్యఅతిథిగా పాల్గొన్నారు. అనంతరం ఇంజినీర్స్ డే సందర్భంగా క్లబ్ అధ్యక్షురాలు ఎంపీఎస్ఎల్ ప్రసూన ఆధ్వర్యంలో టి.సునీతను, ఎంవీశాస్త్రి, బీవీ కిషోర్‌కుమార్‌ను సన్మానించారు. ఈ కార్యక్రమంలో క్లబ్ గవర్నర్ వీఎస్‌వీడీ శివప్రసాద్, మాజీ గవర్నర్ ముంజులూరి విశ్వేశ్వరరావు, క్లబ్ కార్యదర్శి ఎస్.శ్రీదేవిరెడ్డి, సభ్యులు బి.శ్రీవాణి, ఎన్.సత్తిరెడ్డి, సత్యమూర్తి పాల్గొన్నారు.

వివాహ వ్యవస్థకు ఎంతో మేలు

బోట్‌క్లబ్: రుక్మిణీ కల్యాణం పఠించినా విన్నా వివాహ వ్యవస్థకు ఎంతో మేలు జరుగుతుందని విశ్రాంత అధ్యాపకులు వక్కలంక శారద అన్నారు. వేణుగోపాల సంస్కృత ప్రచార సభ ఆదివారం ఏర్పాటు చేసిన గణేశ నవరాత్రుల సాహిత్య కార్యక్రమంలో ఆమె ప్రధాన వక్తగా పాల్గొన్నారు. ఈ సభకు అధ్యక్షత వహించిన ప్రముఖ కవి, సాహితీ స్రవంతి అధ్యక్షుడు మార్ని జానకిరామ చౌదరి మాట్లాడుతూ చారిత్రక వారసత్వ సంపద విలువ కలిగిన మహోన్నత సంస్థ వేణుగోపాల సంస్కృత ప్రచార సభ చేస్తున్న సమారాధనను కొనియాడారు. ఈ సభలో ప్రముఖ సాహితీవేత్తలు కాశీభట్ల సత్యనారాయణ, గొట్టుముక్కల వెంకట సత్య నరసింహశాస్త్రి, ప్రచారసభ అధ్యక్షుడు జీవీ కృష్ణంరాజు, ఉపాధ్యక్షుడు సరిపెల్ల శ్రీరామచంద్ర మూర్తి పాల్గొన్నారు.

కళాకారులకు సత్కారం



కళాకారులను సత్కరించిన భారతమాత సేవా పరిషత్ సభ్యులు

సామర్లకోట: అంతరించుకుపోతున్న కళలను ప్రోత్సహిస్తున్నట్టు భారత మాత సేవా పరిషత్ అధ్యక్షుడు గొరకపూడి చిన్నయ్యదొర అన్నారు. స్థానిక సంపెంగతోటలో ఆదివారం సాయంత్రం కళాకారులకు పాటల పోటీలు ఏర్పాటు చేసిన వారిని ఘనంగా సత్కరించారు. ఈ కార్యక్రమంలో సేవా సమితి సభ్యులు మూతిన రాంబాబు, ముప్పిడి బాబీ, మన్యం సూర్యారావు, మున్నీ, సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా దీపోత్సవం

సామర్లకోట: స్థానిక 13వ వార్డు బలుసులపేట రామాలయంలో ఏర్పాటు చేసిన గణపతి శిబిరంలో ఆదివారం రాత్రి దీపాలంకరణ చేశారు. ఈ దీపాలంకరణ వార్డు కౌన్సిలర్ నేతల హరిబాబు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఆలయ కమిటీ నాయకులు పాల్గొన్నారు.

జిల్లా కబడ్డీ అసోసియేషన్ అధ్యక్షుడిగా శ్రీకాంత్



నూతన జిల్లా కబడ్డీ కమిటీని అభినందించిన పట్టణ నాయకులు

సామర్లకోట: కాకినాడ జిల్లా కబడ్డీ అసోసియేషన్ అధ్యక్షుడిగా బడుగు శ్రీకాంత్ ఎన్నికయ్యారు. ఆదివారం స్థానిక సుగర్ ఫ్యాక్టరీ గెస్టు హౌస్‌లో నూతన కమిటీ ఎన్నిక నిర్వహించారు. ఎన్నికలో రాష్ట్ర కబడ్డీ అసోసియేషన్ అధ్యక్షుడి జి.వెంకట రెడ్డి, ప్రధాన కార్యదర్శి ఎం.సుబ్బరాజు, కోశాధికారి ఎస్.అర్జునరావు, వర్కింగ్ ప్రెసిడెంట్ బి.సత్యనారాయణ ఆధ్వర్యంలో నూతన కమిటీ ఎన్నిక జరిగింది. అసోసియేషన్‌లో సామర్లకోటకు చెందిన వారికే ప్రాధాన్యత దక్కింది. వైస్ ప్రెసిడెంట్‌గా కొండపల్లి శ్రీను, కార్యదర్శిగా నిమ్మకాయల కిరణ్ ఎన్నికయ్యారు. నూతన కమిటీని మాజీ మున్సిపల్ వైస్ చైర్మన్ యార్లగడ్డ చిన్ని, వైఎస్సార్ సీపీ నాయకుడు గంగిరెడ్డి కృష్ణమూర్తి, కౌన్సిలర్ బలుసు వాసు, రైతు సంఘం అధ్యక్షుడు కంటే బాబు, ఆస్పత్రి అభివృద్ధి కమిటీ మాజీ చైర్మన్ అడబాల కుమారస్వామి తదితరులు అభినందించారు.

ఇసుక ట్రాక్టర్ సీజ్

కోటనందూరు: తాండవ నది నుంచి అక్రమంగా ఇసుకను తరలిస్తున్న ట్రాక్టర్‌ను సీజ్ చేసినట్లు ఎస్సై టి.రామకృష్ణ ఆదివారం తెలిపారు. ట్రాక్టర్ డ్రైవర్‌ను అరెస్టు చేసి కేసు నమోదు చేశామన్నారు. ఈ సందర్భంగా ఎస్సై రామకృష్ణ మాట్లాడుతూ కోటనందూరు మండలంలో అనుమతులు లేకుండా ఇసుక, గ్రావెల్ తవ్వకాలు జరిపితే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

దత్తత.. నిబద్ధత..



- చట్టబద్ధం కాని దత్తతతో చిక్కులు
- శిశువులను కొన్నా, అమ్మినా నేరమే
- నిబంధనల పాటించాలంటున్న అధికారులు

కాకినాడ సిటీ: ఓ వైపు పేదరికంతో పాటు ఆడపిల్లలు అంటే భారంగా భావించేవారు పురిట్లోనే శిశువులను వదించుకునే ప్రయత్నం చేస్తున్నారు. మరో వైపు వివాహమై ఏళ్ల గడుస్తున్నా సంతానం కలగక చాలా మంది మనో వేదనకు గురవుతున్నారు. ఈ ఇద్దరి అవసరాలను ఆసరాగా చేసుకుని దళారుల దందా సాగిస్తున్నారు. దత్తత పేరుతో శిశు విక్రయాలకు పాల్పడుతున్నారు. అయితే చట్టబద్ధం కాని దత్తతతో ఇబ్బందులు తప్పవని అధికారులు హెచ్చరిస్తున్నారు. పిల్లలను పెంచుకోవాలనుకునే వారు పద్ధతులు పాటించాలని సూచిస్తున్నారు.

నిబంధనలివీ..

సంతానం లేని దంపతులు ఇక తమకు సంతానం కలగదు అన్న నిర్ణయానికి వచ్చినప్పుడు దగ్గరి బంధువుల పిల్లలను దత్తత తీసుకోవడం సహజం. రక్త సంబంధీకులు అయినా, బంధువులు అయినా తీసుకునే దత్తతకు చట్టబద్ధత ఉండాల్సిందే. ఒక్కోసారి దగ్గరి బంధువుల పిల్లల్ని దత్తత తీసుకున్నా తరువాత ఇరు కుటుంబాల మధ్య మనస్పర్థలు వచ్చినప్పుడు దత్తత ఇచ్చిన పిల్లల్ని తిరిగి ఇవ్వమనే గొడవలు కూడా చోటు చేసుకుంటాయి. అందుకే బంధువుల పిల్లల్ని తీసుకోవాలనుకున్నా చట్టబద్ధంగా తీసుకోవడం ఉత్తమం. దత్తత తీసుకోవాలనుకునే జంట మానసికంగా, శారీరకంగా ఆరోగ్యంగా ఉండాలి. జీవితానికి ప్రమాదకరమైన ఎలాంటి అనారోగ్య సమస్యలు ఉండకూడదు. దత్తత తీసుకునే పిల్లలను బాగా చూసుకునేందుకు ఆర్థిక పరిపుష్టిని కలిగి ఉండాలి.

వెబ్‌సైట్‌లో అన్ని వివరాలు

దత్తత తీసుకోవడానికి దేశవ్యాప్తంగా ఒకే విధానం అమలులో ఉంది. దత్తత తీసుకోవాలనుకుంటున్న వారు సీఏఆర్ఏ (సెంట్రల్ అడాప్షన్ రిసోర్స్ అథారిటీ) వెబ్‌సైట్‌లో వివరాలు నమోదు చేసుకోవాల్సి ఉంటుంది. దంపతుల కుటుంబ వివరాలు, ఆధార్, ఆదాయ, వయసు ధ్రువీకరణ పత్రాలు, చిరునామా, ఆరోగ్య పరీక్షల నివేదికలు అందులో నమోదు చేయాలి. అందులోని ప్రతి నిబంధనను పాటించాల్సి ఉంటుంది. ఈ ప్రక్రియ పూర్తయిన తరువాత నిర్దేశిత శిశు గృహకు వివరాలు చేరుతాయి. వెబ్‌సైట్‌లో సమర్పించిన వివరాలతో అధికారులు సంతృప్త చెందితేనే దత్తత ప్రక్రియ ముందుకు సాగుతుంది.

చట్టబద్ధత లేకుంటే శిక్షార్హులు

అప్పటికప్పుడు పిల్లల్ని దత్తత ఇవ్వడం కూడా సాధ్యం కాదు. ఆ.. ఏమవుతుందిలే అన్న ధీమాతో చట్టానికి సంబంధం లేకుండా పిల్లల్ని దత్తత తీసుకుంటే భవిష్యత్‌లో సమస్యలు ఎదురయ్యే అవకాశాలుంటాయి. బంధువుల పిల్లల్నే దత్తత తీసుకున్నామని చెప్పినా అది చట్ట వ్యతిరేకమే అవుతుంది. అనాథ పిల్లల్ని తెచ్చుకుని పెంచుకుంటామన్నా కుదరదు. పేద పిల్లల్ని కొనుగోలు చేసి పెంచుకుంటున్నా శిక్షార్హమైన నేరమే అవుతుంది. కొనుగోలు చేసిన వారితో పాటు అమ్మిన వారు, మధ్యవర్తిత్వం చేసిన వారు కూడా శిక్షార్హులవుతారు.

అవగాహన లేక..:

అమ్మా నాన్న అనే పిలుపు కోసం దంపతులు పరితపిస్తుంటారు. వివాహమై ఏళ్ల గడుస్తున్నా సంతానం కలగకపోవడంతో బాధ పడుతుంటారు. అలాంటి వారు పిల్లలను దత్తత తీసుకోవడానికి ఆసక్తి చూపుతారు. దళారులు వీరికి మాయ మాటలు చెప్పి దత్త పేరుతో శిశువులను అమ్ముతున్నారు. దత్తత చట్టాలపై అవగాహన లేని వారు దళారులకు డబ్బులు ఇచ్చి పిల్లలు దత్తత తీసుకుంటుంటారు. అయితే చట్ట పరిధిలో లేని దత్తత చెల్లదన్న విషయాన్ని గ్రహించకపోవడంతో భవిష్యత్‌లో ఇబ్బంది పడే అవకాశాలున్నాయి. చట్టపరిధిలో లేని దత్తతతో పలువురు ఇబ్బంది పడిన సంఘటనలు ఎన్నో ఉన్నాయి. కొన్ని చోట్ల బిడ్డ పెరిగిన తర్వాత తన బిడ్డ తనకు కావాలంటూ కన్నతల్లి గొడవలకు దిగిన ఉదంతాలూ ఉన్నాయి. ఎంతో ప్రేమగా పెంచుకున్న బిడ్డ తన ఒడి నుంచి జారిపోతున్నప్పుడు పెంచుకున్న తల్లి గుండెలు అవిసిపోక తప్పదు. అలాగే బిడ్డను అమ్మిన, కొనుగోలు చేసిన తల్లిదండ్రులు చట్టం దృష్టిలో నేరస్తులుగా నిలవాలి. చట్టపరిధిలో లేని దత్తతలతో ఇరు కుటుంబాలు ఇబ్బందులు పడాల్సిన పరిస్థితులు ఏర్పడతాయి.

చట్టప్రకారం దత్తత పొందాలి

సంతాన లేమితో బాధపడుతున్నవారు ఎవరో ఒకరిని తెచ్చుకుని పెంచుకుంటామంటే కుదరదు. దానిని చట్ట వ్యతిరేక చర్యగానే భావిస్తారు. బంధువుల పిల్లల్ని దత్తత తీసుకోవాలనుకున్నా సరే దానికి కూడా ఒక పద్ధతి ఉంటుంది. కేంద్ర ప్రభుత్వాధీనంలోని కారా వెబ్‌సైట్‌లో పిల్లల దత్తత గురించి దరఖాస్తు చేసుకోవాల్సి ఉంటుంది. అన్నీ సక్రమంగా ఉంటే నిబంధనల ప్రకారం దత్తత ఇస్తారు.

కొనుగోలు చేయడం తప్పు



సంతానం లేని కొందరు దంపతులు అవగాహన లోపంతో పిల్లలను కొనుగోలు చేసి పెంచుకుంటుంటారు. కొందరు బంధువుల పిల్లలను దత్తత పేరుతో తీసుకుంటుంటారు. ఈ రెండు విధానాలూ తప్పే. కొన్నవారితో పాటు అమ్మినవారూ ఇబ్బందుల ఎదుర్కోవాల్సి వస్తుంది. చట్ట ప్రకారమే పిల్లలను దత్తత తీసుకోవాలి.

– కె.ప్రవీణ,
జిల్లా స్త్రీ, శిశు సంక్షేమాధికారిణి, కాకినాడ

గణపతికి బెల్లం కుందులతో అలంకరణ



బెల్లం కుందుల అలంకరణలో సంపత్ విజయగణపతి

బోట్‌క్లబ్: గణపతి నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా స్థానిక దేవదాయశాఖ డీసీ కార్యాలయ ప్రాంగణంలో ఉన్న సంపత్ విజయ గణపతి స్వామి వారికి ఆదివారం మహాన్యాస పూర్వక పంచామృతాభిషేకం నిర్వహించారు. అనంతరం స్వామి వారికి బెల్లం కుందులతో ప్రత్యేకంగా అలంకరించి, పూజలు నిర్వహించారు. దేవదాయశాఖ డీసీ కార్యాలయ సూపరింటెంటెంట్ కనపర్తి నాగేశ్వరరావు ఆధ్వర్యంలో పూజలు నిర్వహించారు. భక్తులకు తీర్థప్రసాదాలు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో ఆలయ ఈఓ రమణ, అధిక సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు.

నిమజ్జనోత్సవానికి బందోబస్తు

- కాకినాడలో ఏర్పాట్లు పూర్తి
- సీసీ కెమెరాలతో నిఘా

కాకినాడ సిటీ: గణేశ్ నిమజ్జనోత్సవాన్ని ప్రశాంతంగా నిర్వహించేందుకు పోలీస్‌శాఖ చర్యలు చేపట్టింది. నగరంలో సోమవారం నిమజ్జనోత్సవం నిర్వహించనున్నారు. ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు చోటు చేసుకోకుండా కార్యక్రమాన్ని ఆద్యాంతం డ్రోన్, సీసీ, వీడియో కెమెరాలతో చిత్రీకరించనున్నారు. ఇప్పటికే నగర గణేశ్ ఉత్సవ సమితి వేదిక ఆధ్వర్యంలో పోలీస్ స్టేషన్ల వారీగా సూచనలు ఇచ్చారు. శోభాయాత్రలో తీసుకోవాల్సిన జాగ్రత్తలను వివరించారు. సిటీ వినాయక సాగర్‌లో మూడు అడుగుల లోపు గణేశ్ విగ్రహాలను నిమజ్జనం చేసేందుకు ప్రభుత్వం అనుమతించింది. ఈ నిమజ్జనోత్సవాన్ని ప్రశాంతంగా జరిగేందుకు భారీ భద్రత ఏర్పాట్లు చేపట్టారు. జగన్నాథపురం రెండు వంతెన నడుమ ఉన్న ఉప్పుటేరు ప్రాంగణ ఆవరణలో వినాయక సాగర్‌తో బాటుగా సిటీలో వన్‌టౌన్ జెట్టీ గోదావరి చాంబర్ ఆఫ్ కామర్స్ జెట్టి, బ్రహ్మంగారి మఠం వద్ద నిమజ్జనం నిర్వహణ కోసం ఏర్పాట్లు చేశారు. భారీ విగ్రహాలను కలపడానికి వీలుగా గజ ఈతగాళ్ల బృందంతో భారీ క్రేన్లను ఉంచారు. బారికేడ్లు ఫ్లడ్ లైట్లు నిలిపారు. తాగునీరు, అంబులెన్స్, ఫైర్ ఇంజిన్ నిర్వహణ అందుబాటులో ఉంచారు. తాళ్లరేవు పరిధిలోని చొల్లంగి చిన్న కాశీ రేవు వద్ద, కాకినాడ ఉత్తరవైపు రూరల్ గ్రామాల నుంచి గణేశ్ విగ్రహాలు నిమజ్జనం చేయడానికి వస్తాయి. జిల్లాలోని సుదూర ప్రాంతాల నుంచి భారీ విగ్రహాలు సూర్యారావుపేట, వాకలపూడి సముద్ర తీరానికి వచ్చేలా చర్యలు చేపట్టారు.

ప్రమాదాలకు తావివ్వకుండా...

నగరంలోని అన్ని ప్రాంతాల నుంచి వినాయక ఘాట్‌కు విగ్రహాలు నిమజ్జనానికి ఎక్కువగా తరలి వచ్చే అవకాశముంది. ప్రమాదాలకు తావువివ్వకుండా ఎస్పీ విక్రాంత్ పాటిల్ ఆధ్వర్యంలో ఏర్పాట్లను పర్యవేక్షిస్తున్నారు. వేడుక నిర్వహణ, ప్రణాళిక, రూట్ మ్యాప్, సిబ్బంది నియామకం ఇప్పటికే పూర్తయింది. సబ్ డివిజన్ పరిధిలో ఇన్‌స్పెక్టర్లతో డీఎస్పీ రఘువీర్ ప్రత్యేక సమావేశం నిర్వహించి సీఐ, ఎస్సైలకు కీలక సూచనలు ఇచ్చారు. నగరంలోని అన్ని వీధుల్లో సుమారు రెండు వేలకు పైగా వినాయక విగ్రహాలు మంటపాలు ఉన్నాయి. పోలీస్‌శాఖ వాటి వివరాలను ఆన్‌లైన్ చేసింది. ఎక్కడ ఏమి జరిగినా సాంకేతికతతో తెలుసుకుంటారు. శాంతిభద్రతల పరిరక్షణ బృందాలను రంగంలోకి దింపుతారు.

శాఖల మధ్య సమన్వయం

నిమజ్జనోత్సవాలను తిలకించేందుకు ఘాట్ల వద్దకు ప్రజలు అధిక సంఖ్యలో వచ్చే అవకాశం ఉంది. వీరికి ఎలాంటి అసౌకర్యం కలుగకుండా అన్ని ప్రభుత్వ శాఖలు సమన్వయంతో ఏర్పాట్లు చేస్తున్నాయి. ప్రధానంగా పోలీస్, విద్యుత్, వైద్య, ఆరోగ్య, మున్సిపల్, నీటి పారుదల శాఖ అధికారులు ఏర్పాట్లు పూర్తి చేశారు. నిమజ్జన ప్రదేశాల్లో ఘాట్లలో క్రేన్లు ఏర్పాటు చేశారు. ఆయా ప్రదేశాల్లో గజ ఈతగాళ్లతో పాటు బోట్లు ఏర్పాటు చేశారు. జిల్లాలోని పెద్దాపురం, సామర్లకోట, తుని, గొల్లప్రోలు, ప్రత్తిపాడు, అన్నవరం తదితర ప్రాంతాల్లో గణేశ్ నిమజ్జనోత్సవాలకు అన్ని ఏర్పాట్లు పూర్తి చేసినట్లు సమితి గౌరవాధ్యక్షులు దూసర్లపూడి రమణరాజు వివరించారు.

బైబై గణేశా..!



కాకినాడ రూరల్‌లో వినాయక విగ్రహం ఊరేగింపు



వాకలపూడి శ్రీనివాసనగర్‌లో నిమజ్జనోత్సవం కోసం ఉత్సవ కమిటీ ఊరేగింపు

- గ్రామాలలో మంటపాల నుంచి తరలుతున్న గణనాథులు
- సందడిగా ఊరేగింపులు

కాకినాడ రూరల్: వినాయక చవితి రోజున మండపాల్లో కొలువైన గణనాథుల నిమజ్జనోత్సవాలు ఆదివారం ఘనంగా ప్రారంభమయ్యాయి. ఆలయ కమిటీల ఆధ్వర్యంలో వినాయక ప్రతిమలను వాహనాలలో ఉంచి ఊరేగిస్తూ నిమజ్జనాలకు తరలిస్తున్నారు. భక్తులు స్వామివారిని దర్శించుకున్నారు. కాకినాడ రూరల్‌లో ఆదివారం సందడి వాతావరణం ప్రారంభమైంది. వాకలపూడి, శ్రీనివాసనగర్‌లలోని వినాయక విగ్రహాలను ఉత్సవ కమిటీ సభ్యులు ఊరేగిస్తూ తీసుకెళ్లి సూర్యారావుపేట బీచ్‌లో నిమజ్జనం చేశారు. పలు గ్రామాల్లో విగ్రహాలు నిమజ్జనోత్సవాలు ప్రారంభమయ్యాయి. ఈ సందర్భంగా యువత కేరింతలు కొడుతూ ఆనందంగా పాల్గొన్నారు.

సాధు జీవనం ఆనందానికి మూలం



విశ్వహిందూపరిషత్ సమ్మేళనంలో మాట్లాడుతున్న జి భాస్కరేంద్ర సరస్వతి.

బోట్‌క్లబ్: సాధు జీవనం, ధర్మశాస్త్ర అధ్యయనం ఆనంద జీవనానికి మూలమని ఆధ్యాత్మిక గురువు జి.భాస్కరేంద్ర సరస్వతి అన్నారు. స్థానిక జగన్నాథపురం వేంకటేశ్వరస్వామి ఆలయంలో ఆదివారం విశ్వహిందూ పరిషత్ జిల్లా అధ్యక్షుడు రవిశంకర్ పట్నాయక్ అధ్యక్షతన పరిషత్ సమ్మేళనం జరిగింది. మత మార్పిడులు నిరోధించి, గోవులను రక్షించి, ఎంతో ఉన్నతమైన హిందూ జీవనం గడపడానికి విశ్వ హిందూ పరిషత్ కృషి చేసిందన్నారు. హిందువులందరూ సంఘటితం కావాలన్నారు. రవిశంకర్ పట్నాయక్ హిందూ ధర్మం గొప్పతనం, విశ్వహిందూ పరిషత్ 60 సంవత్సరాలలో సాధించిన ప్రగతి వివరించారు. అనంతరం సాంస్కృతిక కార్యక్రమాల్లో భాగంగా శాస్త్రీయ నృత్యాలు, కోలాటం, లక్ష్మి అష్టోత్తరం, సామూహిక విష్ణు సహస్ర నామ పారాయణ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో పరిషత్ సభ్యులు బిక్కిన రాజు, గోవిందు, రాజరాజేశ్వర రుద్రశర్మ, భానోజీరావు పాల్గొన్నారు.

కాండ్రకోట వెంకటేశ్వరరావు సిద్ధాంతి ఇకలేరు



సిద్ధాంతి మృతదేహానికి నివాళులర్పిస్తున్న దొరబాబు

పెద్దాపురం: కాండ్రకోట ఒబిలిశెట్టి వెంకటేశ్వరరావు సిద్ధాంతి(75) ఆదివారం మృతి చెందారు. నియోజకవర్గంలో మంచి పేరు ప్రఖ్యాతులు సాధించిన ఆయన ఇటీవల అనారోగ్యానికి గురై గుండె ఆపరేషన్ చేయించుకున్నారు. వైఎస్సార్ సీపీలో కీలక నేతగా వ్యవహరించి సిద్ధాంతి మృతితో గ్రామంలో విషాద ఛాయలు అలుముకున్నాయి. ఈ విషయం తెలుసుకున్న వైఎస్సార్ సీపీ పెద్దాపురం నియోజకవర్గ కో–ఆర్డినేటర్ దవులూరి దొరబాబు, జెడ్పీటీసీ గవరసాని సూరిబాబు, నాయకులు ఆయన అంత్యక్రియల్లో పాల్గొని, మృతికి సంతాపం వ్యక్తం చేశారు. కటుంబ సభ్యులకు ప్రగాఢ సానుభూతిని తెలియజేసి ఆయన మృతి పార్టీకి తీరనిలోటన్నారు. సంతాపం వ్యక్తం చేసిన వారిలో గంటా రామస్వామి, చిక్కంబాబు, ఒబిలిశెట్టి నాగభూషణం, గవరసాని నాగేశ్వరరావు, బొజ్జా రెడ్డియ్య తదితరులున్నారు.

పెద్దాపురం డీఎస్పీగా శ్రీహరిరాజు నియామకం

పెద్దాపురం: స్థానిక డీఎస్పీగా డి.శ్రీహరిరాజును నియమిస్తూ ఆదివారం ప్రభుత్వ ఉన్నతాధికారులు ఆదేశాలు జారీ చేశారు. రాష్ట్ర వ్యాప్తంగా డీఎస్పీల బదిలీల్లో భాగంగా ఇప్పటి వరకు పెద్దాపురం డీఎస్పీగా పని చేస్తున్న లతాకుమారిని పోలీస్ హెడ్ క్వార్టర్స్‌కు బదిలీ చేస్తూ ఉత్తర్వులు అందాయి. ఏసీబీ డీఎస్పీగా పని చేస్తున్న శ్రీహరి రాజును ఇక్కడ డీఎస్పీగా నియమించారు. ఈ మేరకు పెద్దాపురం డీఎస్పీగా ఆయన బాధ్యతలు చేపట్టనున్నారు.

కోర్టు ఉత్తర్వుల ప్రకారమే చెల్లింపులు

తాళ్లరేవు: గాడిమొగ గ్రామ పంచాయతీలో ప్రభుత్వ నిబంధనల మేరకే అభివృద్ధి పనులు చేశామని, అలాగే కోర్టు ఉత్తర్వుల ప్రకారమే కాంట్రాక్టర్లకు నిధులు చెల్లించామని సర్పంచ్ కామాడి గోవలక్ష్మి, పంచాయతీ కార్యదర్శి వీజేవీ రమణ తెలిపారు. ఆదివారం గ్రామ పంచాయతీ కార్యాలయంలో ఏర్పాటుచేసిన విలేకర్ల సమావేశంలో వారిద్దరూ మాట్లాడుతూ తమపై ఉపసర్పంచ్ లోకేష్ చేసిన ఆరోపణల్లో వాస్తవం లేదన్నారు. తమ వాళ్లకు సర్పంచ్ పదవి దక్కలేదనే అక్కసుతోనే లేనిపోని ఆరోపణలు చేస్తున్నారని సర్పంచ్ గోవలక్ష్మి విమర్శించారు. పంచాయతీ పాలకవర్గం ఆమోదం, కోర్టు ఉత్తర్వుల ప్రకారమే కాంట్రాక్టర్లకు బిల్లులు చెల్లించామని పంచాయతీ కార్యదర్శి రమణ చెప్పారు. సమావేశంలో పలువురు వార్డు సభ్యులు పాల్గొన్నారు.

కరాటే పోటీల్లో విద్యార్థుల ప్రతిభ



కరాటే పోటీల్లో ప్రశంసా పత్రాలను అందుకుంటున్న లంపకలోవ విద్యార్థులు

ప్రత్తిపాడు రూరల్: ఏలూరు సీఆర్ఆర్ ఇంజినీరింగ్ కళాశాల ఆవరణలో ఈ నెల 14, 15 తేదీల్లో జరిగిన నేషనల్ షోటోకాన్ కరాటే ఓపెన్ చాంపియన్‌షిప్ –2024 (బడేటి కప్) పోటీల్లో మండలంలోని లంపకలోవ కరాటే స్కూల్ విద్యార్థులు ప్రతిభ కనబరిచారు. బాలికల విభాగంలో ఉత్తరకంచి ఆక్స్‌ఫర్డ్ స్కూల్‌కు చెందిన వై.కవిత, వై.అమృత, ప్రత్తిపాడు ప్రభుత్వ బాలికల వసతి గృహం విద్యార్థిని టీజేఎస్ఎం మానస ప్రథమ, ద్వితీయ స్థానాలను కైవసం చేసుకున్నారు. బాలుర విభాగంలో ఒమ్మంగి శ్రీభారతి విద్యానికేతన్ పాఠశాలకు చెందిన జె.సంజు, టి.సుకాంత్, మొదటి, రెండో స్థానాల్లో నిలిచారని కరాటే మాస్టర్ పి.బుజ్జి తెలిపారు. విజేతలకు కియో వైస్ ప్రెసిడెంట్ డాక్టర్ కేఎల్ఎం శాస్త్రి, రాష్ట్ర షోటోకాన్ కరాటే అసోసియేషన్ కార్యదర్శి నాగం శివ తదితరులు మెడల్స్, ప్రశంసాపత్రాలను అందజేశారు. విజేతలను ఆయా పాఠశాలల ఉపాధ్యాయులు, స్థానిక నాయకులు అభినందించారు.

రోగులకు బ్రెడ్ పంపిణీ

తాళ్లరేవు: స్థానిక లయన్స్ క్లబ్ అధ్యక్షుడు పొన్నాడ పేరయ్యరాజు పుట్టినరోజు సందర్భంగా ఆదివారం స్థానిక సీహెచ్‌సీలోని రోగులకు బ్రెడ్లు పంపిణీ చేశారు. అనంతరం కొప్పిశెట్టి లక్ష్మయ్య బ్రాహ్మర్పణ్ ఉచిత అభాగ్యుల భోజన పథకంలో భాగంగా పలువురు అభాగ్యులకు భోజనం అందజేశారు.

కరాటేలో సత్తా చాటిన సామర్లకోట విద్యార్థిని



కరాటేలో ద్వితీయ బహుమతి సాధించిన వర్షిత లక్ష్మీపద్మావతి

సామర్లకోట: చెన్నై నేషనల్ లెవెల్ చాపియన్ షిప్ 2024 కరాటే పోటీల్లో సామర్లకోట విశాలాక్షినగర్‌కు చెందిన వర్షిత లక్ష్మీపద్మావతి ద్వితీయ స్థానం సాధించింది. ఈ విషయాన్ని విద్యార్థిని తల్లిదండ్రులు శ్రీదేవి, సూర్య ఉదయ్‌భాస్కర్ తెలిపారు. వారు స్థానిక విలేకర్లతో ఫోన్‌లో మాట్లాడుతూ ఆదివారం జరిగిన ఈ పోటీల్లో తమ కుమార్తె ద్వితీయ స్థానం సాధించడం ఎంతో ఆనందంగా ఉందన్నారు. వర్షిత లక్ష్మీపద్మావతి స్థానిక భాష్యం స్కూల్‌లో ఆరో తరగతి చదువుతోందని చెప్పారు. కరాటేలో ప్రతిభ సాధించడానికి కోచ్ శంకర్ కారణమన్నారు. విద్యార్థినిని పెద్దాపురం ఆర్డీఓ జె. సీతారామరావు, జాతీయ పర్యావరణ మిత్ర అవార్డు గ్రహీత తోటకూర గంగాధర్, భాష్యం ప్రిన్సిపాల్ సూర్యారావు వర్షితను అభినందించారు.

వేంకటేశ్వరస్వామికి పంచామృతాభిషేకాలు

తుని రూరల్: ఎస్.అన్నవరంలో కొలువైన శ్రీదేవి, భూదేవి సమేత ప్రసన్న వేంకటేశ్వరస్వామి వారికి ఆదివారం పంచామృతాభిషేకాలు నిర్వహించారు. స్వామివారి తిరునక్షత్రం శ్రావణాన్ని పురస్కరించుకుని అర్చకులు స్వామివారికి విశేష పూజలు చేశారు. తొలుత పంచామృత కలశాలతో ఆలయం చుట్టూ ప్రదక్షిణలు చేసి స్వామి, అమ్మవార్లకు, పరివార దేవతలకు అభిషేకించారు. అధిక సంఖ్యలో భక్తులు స్వామి, అమ్మవార్లను దర్శించి, తీర్థ ప్రసాదాలు స్వీకరించారు. పాత సంచుల వర్తక సంఘం, ఆలయ కమిటీ సభ్యులు ఏర్పాట్లను పర్యవేక్షించారు.

పేకాడుతున్న తొమ్మిది మంది అరెస్టు

తుని రూరల్: మండలంలోని తేటగుంట శివారు కొబ్బరితోటలో రహస్యంగా నిర్వహిస్తున్న పేకాట శిబిరంపై ఆదివారం తుని రూరల్ పోలీసులు దాడి చేశారు. ఈ దాడిలో పేకాడుతున్న తొమ్మిది మందిని అరెస్టు చేసి రూ.83,910 నగదు, ఒక టేబుల్, పది కుర్చీలు స్వాధీనం చేసుకున్నట్టు రూరల్ ఎస్సై బి.కృష్ణమాచారి తెలిపారు. నిందితులపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్టు ఎస్సై తెలిపారు.

ఉచిత ట్యూషన్ సెంటర్ ప్రారంభం

తాళ్లరేవు: మండల పరిధిలోని సుంకరపాలెం పంచాయతీ బాబానగర్‌లో సిద్ధార్థ యూత్ ఏర్పాటు చేసిన ఉచిత ట్యూషన్ సెంటర్‌ను ప్రముఖ వైద్యురాలు భానుమతి ప్రారంభించారు. ఆదివారం స్థానిక కమ్యూనిటీ హాలులో జరిగిన కార్యక్రమానికి ఆమె ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడుతూ గ్రామీణ ప్రాంత విద్యార్థులకు ఇటువంటి ట్యూషన్ సెంటర్‌లు ఎంతగానో ఉపయోగపడతాయన్నారు. కార్యక్రమంలో నాగబత్తుల సత్యనారాయణ, వాకపల్లి అప్పారావు, కాశి లక్ష్మణస్వామి, వడ్డి ఏడుకొండలు తదితరులు పాల్గొన్నారు.